క్లుప్తంగా

'గీతాంజలి' దాతృత్వం



నర్సంపేట : ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో వరదలతో జనజీవనం అతలాకుతలం అయిన నేపథ్యంలో పట్టణంలోని గీతాంజలి విద్యాసంస్థలు సీఎం సహాయ నిధికి రూ.65,900 సమీకరించి దాతృత్వం చాటుకున్నాయి. గీతాంజలి డిజీ, గీతాంజలి (ఇంగ్లీష్ మీడియా), శివానీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం డబ్బు సేకరించి సీఎం సహాయ నిధికి చైర్మన్ సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం పంపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు కొత్తపల్లి ప్రవీణ్, గిరగాని రాహుల్, గూడూరు ప్రవీణ్, సౌజన్య మాట్లాడారు. చైర్మన్ సుబ్బారావు సూచనతో నిధి సేకరించినట్టు తెలిపారు.

విద్యార్థులకు టీషర్ట్‌ల పంపిణీ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజేశ్వరపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు సోమంచి ఉమాదేవి సమకూర్చిన టీషర్ట్‌లను ఎంపీఓ రామ్మోహన్, హెచ్ఎం ఈదుల వీరస్వామి విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ బొజ్జ రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి రజియా, తదితరులు పాల్గొన్నారు.

డైరీలు..

పర్వతగిరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంఎన్ఓ లింగారెడ్డి గురువారం డైరీలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ దినచర్యను ఎవరికివారు పరిశీలించుకుంటే భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన చేసుకోవాలని సూచించారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారని తెలిపారు. చదువును నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రమేశ్ బాబు, వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు లలితాదేవి, సుభాషిని, రామస్వామి, నవీన్, ప్రసాద్, లలిత, కిషన్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



వర్ధన్నపేట : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టీఎన్‌జీఓ అనుబంధ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంతాటి మురళీకృష్ణ (చెన్నారం), ప్రధాన కార్యదర్శిగా జంగంపెల్లి సురేశ్ (రామవరం), కోశాధికారిగా నాగపురి అన్వేశ్ (కొత్తపల్లి), ఉపాధ్యక్షురాలిగా జ్యోతిలత (దమ్మన్నపేట), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఆకుల పృథ్వీరాజ్ (బొక్కలగూడెం), గౌరవ అధ్యక్షుడిగా రామారావు (ఇల్లంద) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ మూడేళ్లపాటు కొనసాగుతుంది.

బీసీ హాస్టల్‌లో సీట్లు పెంచాలి

నర్సంపేట రూరల్ : పట్టణంలోని బీసీ బాలికల కళాశాల హాస్టల్‌లో సీట్లు పెంచాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ ఆధ్వర్యంలో ఏబీసీడబ్ల్యూఓ శంకరయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. నర్సంపేటలోని ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, తదితర కళాశాలల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బీసీ విద్యార్థులు అడ్మిషన్ పొందుతుండగా వారి సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్లలో సీట్లు లేవన్నారు. ఈ క్రమంలో హాస్టల్‌లో సీటు దొరక్క విద్యార్థులు వేదనకు గురవుతున్నారని చెప్పారు. పలువురు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే బీసీ కళాశాల హాస్టల్‌లో సీట్లు పెంచి అర్హులందరికీ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, జస్వంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గీసుకొండ : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతానికి గురై చిన్నగారి సాయిబాబుకు చెందిన గేదె మృతి చెందింది. వివరాలిలా.. వర్షానికి బుధవారం రాత్రి 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడింది. ఈ క్రమంలో గేదె మృతి చెందగా మేకల మోహన్ ఇంటిపై మంటలు లేచాయి. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొడు ప్రవీణ్, నాయకులు భరత్, మోహన్, కుమారస్వామి, బాబు, సదానందం, తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి తగు చర్యలకు అధికారులను ఆదేశించారు.

నర్సంపేట : కృష్ణారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నర్సంపేట రూరల్: గురిజాల స్కూల్‌లో నివాళులర్పిస్తున్న హెచ్ఎం, టీచర్లు



ఘనంగా గురుపూజోత్సవం

జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, సంగెం, గీసుకొండ, వర్ధన్నపేట, రాయపర్తి, ఖానాపూర్, తదితర మండలాల్లో గురుపూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో, కళాశాలల్లో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పాల్గొని ఉత్సాహం నింపారు.

-సాక్షి నెట్‌వర్క్



నల్లబెల్లి : నారక్కపేట స్కూల్‌లో..



సంగెం : కాపుల కనపర్తిలో..



సంగెం : విద్యాభారతి స్కూల్‌లో..



వర్ధన్నపేట : ఉప్పరపల్లిలో..



చెన్నారావుపేట : సిద్ధార్థ హైస్కూల్‌లో..



దుగ్గొండి : హెచ్ఎంను సన్మానిస్తున్న ఎస్సై



నెక్కొండ : అప్పల్‌రావుపేటలో..



రాయపర్తి : లహరి పబ్లిక్‌స్కూల్‌లో..

చట్టాలపై అవగాహనతో హక్కుల రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా హక్కులను పరిరక్షించుకోవచ్చని ఎస్సై రఘుపతి తెలిపారు. పోలీస్ కళాజాత ఆధ్వర్యంలో నూతన చట్టాలపై మండలంలోని దబ్బీర్‌పేటలో ఏర్పాటు చేసిన కళాజాతకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని అన్ని వర్గాల హక్కులను పరిరక్షించేలా ప్రభుత్వం చట్టాలను అమలు చేస్తోందని చెప్పారు. కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, తదితరాలకు దూరంగా ఉంటూ సమాజ ఉన్నతిలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. మూఢనమ్మకాలను వీడాలన్నారు. ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై సెల్ నంబర్ 8712584473కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, రాజు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల ఏర్పాటు తప్పనిసరి



లబ్ధిదారుకు విద్యుత్ మీటరు ఇస్తున్న ఏడీఈ

వర్ధన్నపేట : ప్రతిఇంటికీ విద్యుత్ మీటర్ తప్పనిసరిగా ఉండాలని ఆ శాఖ ఏడీఈ కన్న రాజు చెప్పారు. మండలంలోని ఇల్లందలో దరఖాస్తు చేసుకున్న పలువురికి గురువారం ఆయన విద్యుత్ మీటర్లు అందజేసి మాట్లాడారు. మీటరు లేకుండా విద్యుత్ వినియోగం చట్టరీత్యా నేరమని చెప్పారు. పల్లెలో ఎంతో అభివృద్ధి చెందుతుండగా ఇంకా పలువురు మీటర్లు లేకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకుంటున్న దుస్థితి కనపడుతోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇళ్లలో విద్యుత్ మీటర్ లేని ప్రజలు నేరుగా విద్యుత్ సిబ్బందికి రూ.938 చెల్లిస్తే మీటరు అందించి సర్వీస్ నంబర్ కేటాయించి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. అర్హులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేస్తామని తెలిపారు.

ఎకరాకు రూ.30 వేల పరిహారమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

చెన్నారావుపేట : వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఆ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఎడతెరిపి లేని వర్షాలతో జిల్లావ్యాప్తంగా రైతులు పంటలు, ప్రజలు ఆస్తులు నష్టపోయారని చెప్పారు. పెట్టుబడి కోసం అప్పు చేసి పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారులతో సత్వరమే సర్వే చేయించి బాధితులందరికీ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ నష్టాన్ని అధ్యయనం చేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందే దిశగా పోరాటాలు నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేశ్, నాయకులు కన్నం వెంకన్న, నాయకులు హట్యానాయక్, జన్ను సాంబయ్య, శ్రీను, గోరేమియా, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

నల్లబెల్లి : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని నాగరాజుపల్లి శివారు ఒల్లెనర్సయ్యపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిట్యాల రామచంద్రారెడ్డి (70) సతీమణి లక్ష్మమ్మ 15 ఏళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. నాటి నుంచి రామచంద్రారెడ్డి దిగులుగా ఉండేవాడు. గత నెల 2న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అనంతరం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం బుధవారం రాత్రి ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడు.

ప్రభుత్వం ఆదుకోవాలి

చెన్నారావుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న, ఇతర పంటలు నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని మండలానికి చెందిన రైతులు కోరుతున్నారు. మండలంలోని సూర్యపేట తండాకు చెందిన రైతు ధారావత్ నాగు, తదితరులు మొక్కజొన్న పంటలు దెబ్బతిని నష్టపోయారు. ఈ సందర్భంగా నాగు మాట్లాడారు. తనకున్న ఎకరన్నర భూమిలో మొక్కజొన్న పంట వేశానని తెలిపారు. పెట్టుబడి సుమారుగా రూ. 20 వేల వరకు పెట్టానని, పంట చేతికొచ్చే సమయంలో చెట్లన్నీ నేలవాలడంతో తీవ్రంగా నష్టపోయానని అన్నారు. తనతోపాటు తండాలో పలువురు రైతుల మొక్కజొన్న పంటలు సైతం దెబ్బతిన్నాయని చెప్పారు. ఇకనైనా వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక అందించి బాధిత రైతులకు పరిహారం అందించేలా కృషి చేయాలని కోరాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పర్వతగిరి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం ఆయన వైద్యపరీక్షలు చేయించుకుని మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, డాక్టర్ ఉదయ్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి రఘు, తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు సంఘీభావం



గీసుకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో తన ఇంటి వద్ద రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాద్గే చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గురువారం ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్, మండల అధ్యక్షులు సిలువేరు రవీందర్, చాపర్తి రాజు సంఘీభావం తెలిపారు. దీక్ష 12వ రోజుకు చేరుకోగా పలువురు కుమార్‌కు అండగా నిలిచారు.

సన్మానం



చెన్నారావుపేట : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌కు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు కొండి మాధవి అవార్డు అందుకున్న సందర్భంగా మాధవి దంపతులను పాఠశాల ఆవరణలో హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు గురువారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, సంతోశ్ కుమార్, రాగి శ్రీధర్, పిన్నింటి బాలాజీరావు, సీహెచ్.మాధవి, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు హైస్కూల్‌లో..

రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కొంక అనురాధ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకోగా అదే పాఠశాలకు చెందిన వేల్పుల స్వర్ణలత, పెర్కవేడుకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రమోద్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

కేజీబీవీలో..

సంగెం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న మండల కేంద్రంలోని కేజీబీవీ ఉపాధ్యాయురాలు యమునను విద్యాలయ ఆవరణలో ప్రత్యేక అధికారి (ఎస్ఓ) నీలిమ, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఓ నీలిమ మాట్లాడారు. యమున ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా

● నేడు పంచాయతీల్లో అందుబాటులోకి..



ఎంపీడీఓ కార్యాలయంలో వార్డు విభజనకు కసరత్తు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

సంగెం : గ్రామపంచాయతీ ఎన్నికలకు అడుగులు పడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఒకే కుటుంబానికి సంబంధించిన వారి ఓట్లు ఒకే వార్డులో ఉండేలా సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత నేడు (సెప్టెంబర్ 6న) వార్డుల వారీగా ముసాయిదాను గ్రామపంచాయతీల్లో ఓటర్లకు అందుబాటులో ఉంచనున్నారు. అనంతరం 13వ తేదీ వరకు వార్డుల విభజనపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారు. 18న మండల స్థాయిలో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 19న మండలస్థాయిలో ఎంపీడీఓ ఆమోదం, 21 వరకు రూరల్ అసెంబ్లీ ఓటర్లను వార్డు, గ్రామపంచాయతీ ఓటర్ల జబితా పునర్‌వ్యవస్థీకరణపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 26న డీపీఓ ద్వారా అభ్యంతరాలను తొలగిస్తారు. అనంతరం డీపీఓ ద్వారా ఆమోదించి 28న గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన తుది జాబితా ప్రచురిస్తారు.

మొత్తం ఓటర్లు

మండలంలో మొత్తం 33 గ్రామపంచాయతీలున్నాయి. మొత్తం ఓటర్లు 41,089 ఉండగా స్త్రీలు 20 వేల 735 మంది, పురుషులు 20 వేల 354 మంది ఉన్నారు. సంగెం, గవిచర్ల 12 వార్డులుగా, ఆశాలపల్లి, చింతలపల్లి, ఎల్గూర్ రంగంపేట, కాపుల కనిపర్తి, కాట్రపల్లి, కుంటపల్లి, మొండ్రాయి, రామచంద్రాపురం, తీగరాజుపల్లిల్లో 10 వార్డులు, ముమ్మడివరం, సోమ్లాతండాల్లో 6 వార్డులుగా మిగిలి గ్రామాల్లో 8 వార్డులుగా మొత్తం 286 వార్డులుగా విభజించారు.

ఆశావహుల్లో ఉత్సాహం

గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం కావడంతో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు ఆశావహులు సమాయత్తమవుతున్నారు. వ్యక్తిగత పనులు పక్కన పెట్టి గ్రామాల్లో జరిగే శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరితో కలుపుగోలుగా ముందుకు సాగుతున్నారు. అప్పుడే అందరినీ పేరుపేరున పలకరిస్తూ తమకు సహకరించాలని కోరుతున్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి



చెన్నారావుపేట : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్



నెక్కొండ : తండాలో సర్వే చేస్తున్న వైద్యాధికారి

చెన్నారావుపేట : వర్షాకాల నేపథ్యంలో సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సరోజ కోరారు. మండలంలోని ఉప్పరపల్లి, చెన్నారావుపేట, గురిజాల, పుల్లయ్యబోడుతండా, బాలునాయక్ తండాలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రామెల్, కీర్యా, ఎంఎల్‌హెచ్‌పీలు సహజ, భవానీ, దయకుమారి, యమున, సురేందర్, లింగమూర్తి, సారియ, రమ, పుష్ప, రాజకుమారి, కాంతి, శ్వేత, సరిత పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని చెరువుముందరి తండా జీపీలో నిర్వహించిన వైద్యశిబిరంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అర్చన పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. తండాకు చెందిన గర్భిణికి డెంగీ నిర్ధారణ కావడంతో తండాలో దోమల మందు పిచికారీ చేశామన్నారు. తండావాసులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించామని చెప్పారు. అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని కొత్తూరులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో సిబ్బంది పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ కల్పన మాట్లాడారు. నీటి నిల్వలు ఉన్న చోట్ల దోమల వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. టైర్లు, ఇతర సామగ్రిలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి, ఏఎన్ఎం రజిత, ఆశ కార్యకర్తలు సులోచన, సంధ్య, సుమలత, కారోబార్ యాకయ్య పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని ధర్మారంలో 62 మందికి పరీక్షలు నిర్వహించారు. డెంగీ, మలేరియా కిట్లతో ఎనిమిది మందికి ప్రత్యేక పరీక్షలు చేశారు. దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యాంటీ లార్వల్ మందు స్ప్రే చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నేహ, సీహెచ్ఓ మధుసూదన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కిరణ్, పద్మావతి, హెచ్ఏ రఘుప్రసాద్, ఏఎన్ఎంలు వినోద, కవిత, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : పరీక్షలు చేస్తున్న డాక్టర్ కల్పన



గీసుకొండ : ధర్మారంలో..

క్రియాశీలకంగా విధులు నిర్వర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

చెన్నారావుపేట : ప్రభుత్వ ఉద్యోగులు క్రియాశీలకంగా విధులు నిర్వర్తించాలని డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీఓ కార్యాలయాన్ని, లింగగిరిని గురువారం ఆయన సందర్శించారు. లింగగిరిలోని పరిసరాలతోపాటు నర్సరీలను, ఎంపీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ఉద్యోగుల విధులు కీలకమని చెప్పారు. పన్నులు నూరు శాతం వసూలయ్యేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. శానిటేషన్ పనులను నిరంతరం కొనసాగించాలని, నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, వార్డుల వారీగా ఈనెల 13 నాటికి ఫొటోలతో ఓటర్ లిస్టులు సిద్ధం చేయాలని చెప్పారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీఓ శ్రీధర్ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట : పట్టణానికి చెందిన మేడిశెట్టి వెంకటేశ్ అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు. వెంకటేశ్ మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, కౌన్సిలర్ జుర్రు రాజు, నాయకులు గోల్య, రాజు, రాంచందర్, దయాకర్, శ్రీను, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన పలువురు బాధితులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కారంపాడి రాములు, బండ్ల సారయ్యలతోపాటు ఇటీవల మృతి చెందిన ఎంబాడి చేరాలు కుటుంబానికి బాలకిశోర్‌రెడ్డి రూ.5 వేలు చొప్పున గురువారం పంపించగా స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, కూనమల్ల అనిల్, సాంబయ్య, పేర్ల రవి, కొమురయ్య, బొంద్యాలు తదితరులు అందజేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి

నర్సంపేట రూరల్ : పల్లెల్లో తక్షణమే పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి రాష్ట్ర ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. మండలంలోని మాదన్నపేటలోని పలు కాలనీలను ఆయన ఆధ్వర్యంలోని బృందం గురువారం సందర్శించి సమస్యలను అధ్యయనం చేసింది. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడారు. ఇటీవల కురిసిన ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయిందని తెలిపారు. పలు గ్రామాల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, మాజీ సర్పంచ్ కర్ని సాంబయ్య, నాయకులు ఆకుల రాజేందర్, కందికొండ సాంబయ్య, గుర్రం రవి తదితరులు పాల్గొన్నారు.